

ప్రభుత్వ భవనాలు పూర్తి చేయాలి : కలెక్టర్

ఏలూరు అర్బన్ : ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణాలను నవంబరు నెలాఖరు నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో పలు మండ లాల గ్రామ సర్పంచులు, ఎంపిడిఒలు, ఇఒపిఆర్‌డిలు, పంచాయతీరాజ్ ఇంజినీర్లు తదితరులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాల పురోగతి, సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ షెడ్డుల నిర్మాణం, నిర్వహణ తదితర అంశాలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పనుల ప్రగతిపై రోజువారీ పర్యవేక్షణ ఉండాలన్నారు. నిర్దేశించిన సమయంలో పనులు ప్రారంభం కాకపోయినా, పూర్తిచేయకపోయినా సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. పనుల నిర్వహణలో ఏమైనా సమస్యలు ఉంటే ఆయా గ్రామాలకు సంబంధిత ఎంపిడిఒ, పంచాయతీరాజ్ ఎఇలు వెళ్లి గ్రామ సభల ద్వారా స్థానికుల అభిప్రాయాలను తెలుసుకొని పనుల్లో పురోగతి సాధించాలన్నారు.

యువజనోత్సవాలు ప్రారంభం

ఉత్సాహపూరిత వాతావరణంలో ఏలూరు సెయింట్ థెరిస్సా కళాశాలలో నిర్వహణ



యువజనోత్సవాలను ప్రారంభిస్తున్న ఎంఎల్‌సి సాబ్జీ, ఇతర ప్రతినిధులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాస్థాయి యువజనోత్సవాలు ఉత్సాహపూరిత వాతావరణంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. స్థానిక సెయింట్ థెరిస్సా కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి యువజనోత్సవాలను శాసన మండలి సభ్యులు షేక్ సాబ్జీ, దెందులూరు శాసన సభ్యులు కొఠారు అబ్బయ్య చౌదరి, జిల్లా రెవెన్యూ అధికారి ఎవివి.సత్యనారాయణ మూర్తి ప్రారంభించారు. తొలుత మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ 135వ జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా రెవిన్యూ అధికారి ఎవివి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ యువత మంచి మార్గం వైపు పయనించేందుకు యువజనోత్సవాలు దోహదపడతాయన్నారు. ప్రతిఏట జనవరి 12న స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని జాతీయ యువజనోత్సవాలు నిర్వహించబడతాయని ఇందులో జిల్లాయువత ప్రతిభ కనబరచాలన్నారు. దెందులూరు శాసన సభ్యులు కొఠారు అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ యువతలో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు యువజనోత్సవాలు దోహదపడతాయన్నారు. షేక్ సాబ్జీ మాట్లాడుతూ జిల్లాస్థాయి యువజనోత్సవాలు యువతలో స్ఫూర్తిని నింపుతాయన్నారు. స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకొని ధడమైన సంకల్పం, క్రమ శిక్షణతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. యువజన సర్వీసుల శాఖ సెట్ వెల్ సిఇఒ ఎమ్‌డిహెచ్ మెహరాజ్ మాట్లాడుతూ యువతకు యువజన సర్వీసుల శాఖ ద్వారా అందిస్తున్న కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలుప్రదర్శనలు మైమరపించజేశాయి. వాయిద్య, గాత్ర, నృత్య విన్యాసాలు వీనులవిందుగా సాగాయి. ఈ ప్రదర్శనలను తిలకించిన యువతీ యువకులు కేరింతలు కొట్టారు. కరతాళ ధ్వనులు, ఈలలతో తమ సహచరులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ అధికారి డి.కిషోర్, పర్యాటక మేనేజరు ఎస్.పట్టాభిరామన్న, సెయింట్ థెరిస్సా కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ మెర్సీ, బిసి సంక్షేమ అధికారి ఆర్‌వి.నాగరాణి పాల్గొన్నారు.



దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న తెల్లం రామకృష్ణ

నిర్వాసితులను జలసమాధి చేయొద్దు

గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ

ప్రజాశక్తి - కుక్కునూరు

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వం త్యాగం చేస్తున్న నిర్వాసితులను గోదావరిలో ముంచి జలసమాధి చేస్తారా.. నిర్వాసితులపట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి దారుణం అంటూ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ ఆగ్రహం వ్యక్తంచేశారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారానికి ఐదో రోజుకు చేరాయి. నిర్వాసితులు చేస్తున్న రిలే దీక్షలకు రామకృష్ణ, నాయకులు కారం భాస్కర్ సందర్శించి దీక్షలకు మద్దతు ప్రకటించి దీక్షలో పాల్గొన్నారు. ఈ దీక్షలనుద్దేశించి రామకృష్ణ మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రభుత్వాలు, అధికారులు సమీక్షలు పెడుతున్నారే తప్ప దాని కోసం త్యాగం చేస్తున్న నిర్వాసితుల పరిహారం చెల్లింపుపై ఎవరూ మాట్లాడటం లేదని, ప్రాజెక్టు నిర్మాణం పూర్తికాకముందే బ్యాక్ వాటర్ ప్రభావం వల్ల ఇప్పటికే గ్రామాలు మునిగాయని, ప్రభుత్వం మాత్రం పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించకుండా ప్రాజెక్టును పూర్తిచేసి గ్రామాల్లోని నిర్వాసితులను జలసమాధి చేసేందుకే చూస్తుందని విమర్శించారు.

నిర్వాసితుల సమస్యలు చెప్పుకోవడానికి 120 కిలోమీటర్లమేర కెఆర్.పురం ఐటిడిఎ కార్యాలయానికి వెళ్లాల్సి వస్తుందని, నెలకో ఐటిడిఎ పిఒని బదిలీ చేస్తూ ఉంటే నిర్వాసితుల సమస్యలు ఎలా పరిష్కారమవుతాయన్నారు. కుక్కునూరులోనే సమస్యల పరిష్కారానికి ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని, ఎల్లప్పగూడెం, కొండిన్యముక్తి, మాధవరం, బెస్తగూడెం గ్రామాలను మొదటి కాంటూరులో చేర్చాలని, గోదావరి వరదల కారణంగా ఇళ్లు కోల్పోయిన వరద బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలో నిర్వాసితుల సంఘం నాయకులు వై.నాగేంద్రరావు, పట్ల లక్ష్మయ్య, వై.సాయికిరణ్, ఎస్.లక్ష్మణరావు, ఎస్.సిరామమ్మ, తిరుపతమ్మ, రాములమ్మ, పద్మ, రాజమ్మ, ఎస్.నాగరాజు, బాలరాజు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్

ఆదిలోనే హంసపాదు..!

ధాన్యం సేకరణలో సాంకేతిక సమస్యలు
యాప్‌లో వివరాలు నమోదు కాని పరిస్థితి
మందకొడిగానే ధాన్యం సేకరణ

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో కొనుగోళ్లు మందకొడిగానే సాగుతున్నాయి. జరుగుతోంది. పౌరసరఫరాల శాఖ రాష్ట్ర ఉన్నతాధికారి, జిల్లా అధికారులు మూడు రోజుల నుంచి ఉంగుటూరు మండలంలోనే తిష్టవేసి యంత్రాంగాన్ని సమన్వయపరుస్తూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ కొంత వరకూ సక్రమంగానే ఉన్నప్పటికీ యాప్‌లో నమోదులోనే సాంకేతిక సమస్యలతో ఆరుబస్తాలు సేకరణ మూడు బస్తాలు ఎగుమతి... అన్న రీతిగా మారింది. రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ జి.వీరపాండియన్, జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, సంయుక్త కలెక్టర్ అరుణ్‌బాబు, ఆర్‌డిఒ పెంచల్ కిషోర్, డిఎస్‌ఒ సూర్య నారాయణరాజు, సివిల్ సప్లయిస్ డిఎం మంజుభార్గవి, జిల్లా సహకార అధికారి ప్రసన్న, భీమడోలు ఎడిఎ పి.ఉషారాజకుమారి, తహశీల్దారు ఎవి.రమణారావు తదితర యంత్రాంగం శుక్రవారం నారాయణపురం, ఉంగుటూరులో రైతుభరోసా కేంద్రాలను సందర్శించారు. నారాయణపురం ఆర్‌బికెలో పరిధిలో ప్రస్తుతం సేకరించిన ధాన్యానికి 11 లారీలు అవసరం ఉండగా మూడు లారీలు రావడంపై అక్కడి సిబ్బందిని కలెక్టర్ ప్రశ్నించారు. యాప్‌లో సాంకేతిక సమస్యల కారణంగా లారీ నంబరు డిస్‌ప్లే కాకపోవడం, వాలంటీర్ యాప్ సరిగా పనిచేయని కారణంగా ఎఫ్‌టిఒ (ట్రక్ షీట్) జనరేట్ కాకపోవడం వంటి సమస్యలను గుర్తించారు. దీనిపై సంబంధిత టిసిఎస్ సాంకేతిక నిపుణుల బృందంతో అధికారులు సమీక్షించారు. యాప్‌లో చిన్నచిన్న బగ్స్‌లను గుర్తించి వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని టిసిఎస్ ప్రతినిధులు చెప్పారు. ఉంగుటూరులో 2500 ఎకరాల్లో ధాన్యం దిగుబడులు రానున్నాయని శాంపిల్స్ సేకరణ, గోనె సంచులు ఇచ్చేందుకు ఒక్కరే సిబ్బంది వల్ల పని జరగదని రైతులు అధికారుల దృష్టికి తెచ్చారు. అన్ని సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు సమాధానం ఇచ్చారు. నారాయణ పురం సొసైటీ పరిధిలో 18 ఆర్‌బికె ద్వారా శుక్రవారం ఏడు లారీల్లో ధాన్యం రవాణా చేసేం దుకు అన్ని ఏర్పాట్లు చేసినా యాప్ పనిచేయ కపోవడంతో రవాణా ఆగిందని సిబ్బంది చెప్పారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

ప్రజాశక్తి - దెందులూరు

రైతులకు గోనె సంచులు ఇచ్చి కల్లాల్లోని ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం దెందులూరు మండలంలోని పోతునూరు, ఉండ్రాజవరం, సత్యనారాయణపురం తదితర గ్రామాల్లో రైతు సంఘం నాయకులు పర్యటించి కల్లాల్లోని ధాన్యాన్ని పరిశీలించారు. రైతులను, కౌలురైతులను కలిసి ధాన్యం కొనుగోలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పోతునూరులో కొనుగోలు కేంద్రాన్ని తెరిచినా ధాన్యం కొనుగోలు జరగడంలేదని రైతు సంఘం నాయకుల దృష్టికి రైతులు తీసుకువచ్చారు.

ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరిచినా కొనుగోలుకు ఆదేశాలు లేదని చెప్పడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వాతావరణ పరిస్థితుల్లో మార్పులు రావడంతో అన్నదాతలు దిక్కు తోచని స్థితిలో ఉన్నారని చెప్పారు. తేమశాతం వంటి నిబంధనలు సడలించి కల్లాల్లోని ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని కోరారు. చినిగిన గోనె సంచులు ఇస్తున్నారని ధాన్యం నేలపాలై నష్టపోతున్నారని తెలిపారు. గోనె సంచుల కొరత నివారించి రైతులకు, కౌలు రైతులకు గోనె సంచులు అందించాలని కోరారు. కొనుగోలు చేసిన ధాన్యానికి వారం రోజుల్లో రైతుల బ్యాంకు ఖాతాలకు సొమ్ములు జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం మండల కార్యదర్శి సున్నా వెంకట్రావు, రైతులు పట్నాల సింహాచలం, జి.రామచంద్రరావు, ఎస్.సాయి, కె.రంగారావు పాల్గొన్నారు.



ధాన్యం రాసులు పరిశీలిస్తున్న నాయకులు

మిన్నంటిన 'మోడీ గో బ్యాక్' నిరసనలు



ఏలూరులో ధర్నా చేస్తున్న వామపక్ష నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన ప్రధాని మోడీకి ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించే అర్హత లేదని వామపక్ష నాయకులు అన్నారు. ప్రధాని మోడీ విశాఖ పర్యటనను నిరసిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ కూడలి వద్ద ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ ధర్నాలో సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావు (యువి), సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పళ్లెం కిషోర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అన్యాయం, మోసం, ద్రోహం చేస్తుందని విమర్శించారు. అవినీతిలో కూరుకుపోయిన జగన్ కేసుల నుంచి తనను తాను కాపాడుకోవడానికి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నార న్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, సిపిఎం నాయకులు బి.సోమయ్య, కె.శ్రీనివాస్, పి.ఆదిశేషు, బి.జగన్నాధం, సాయిబాబా, కోటేశ్వరరావు, గోపి పాల్గొన్నారు. సిపిఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ పాల్గొన్నారు.

చింతలపూడి : రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన ప్రధాని మోడీకి ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించే అర్హత లేదని సిపిఎం చింతలపూడి కన్వీనర్ ఆర్‌విఎస్.నారాయణ, సిపిఐ సీనియర్ నాయకులు వసంతరావు అన్నారు. పట్టణంలో ప్రధాని మోడీ విశాఖ పర్యటనను నిరసిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో స్థానిక పాతబస్టాండ్ కూడలి వద్ద శుక్రవారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ గత పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మోడీ ప్రత్యేక హోదా, విభజన హామీలు, విశాఖ కేంద్రంగా వాల్తేరు రైల్వే డివిజన్, వెనుకబడిన ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ, పోలవరం ప్రాజెక్టు పూర్తి తదితర అంశాలపై వాగ్దానం చేసి అధికారం చేపట్టి ఎనిమిదేళ్లు గడిచినా హామీలు అమలు చేయకుండా రాష్ట్రానికి తీరని ద్రోహం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి టి.బాబు, సిపిఎం నాయకులు ఎస్.సూర్యకూమర్, గురవయ్య, దొంత కృష్ణ పాల్గొన్నారు.

జంగారెడ్డగూడెం : విశాఖపట్నంలో మోడీ పర్యటనకు వ్యతిరేకంగా జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద కార్మిక సంఘాలు, వామపక్ష నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు కెవి.రమణ, సిపిఐ మండల కార్యదర్శి జంపన వెంకట రమణరాజు, ఎంసిపిఐయు నాయకులు అప్పలరాజులు మాట్లాడారు. అనంతరం ఆర్‌డిఒ ఝాన్సీరాణికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఎస్‌కె.సుభాషిని, ఐఎఫ్‌టియు డివిజన్ నాయకులు, డివైఎఫ్ఐ నాయకులు, పిఒడబ్ల్యు నాయకులు, పిడిఎస్‌యు నాయకులు పాల్గొన్నారు.

వేలేరుపాడు : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విశాఖ పర్యటన రాకను వ్యతిరేకిస్తూ సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సన్నేపల్లి సాయిబాబు, మండల కార్యదర్శి బాడిశ రాము, రామవరం సర్పంచి పిట్ట ప్రసాద్, జిల్లా కౌన్సిల్ సభ్యులు పిట్ట వీరయ్య, మడివి కామయ్య, మహిళా సమైక్య నాయకులు పాల్గొన్నారు.

నూజివీడు : విశాఖలో మోడీ పర్యటనకు నిరసనగా నూజివీడులో సిపిఐ, సిపిఐ(ఎం), ఎఐటియుసి, సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక చిన్న గాంధీ బొమ్మ సెంటర్లో పెద్ద ఎత్తున మోడీ గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు, సిపిఐ పట్టణ కార్యదర్శి చాట్ల పుల్లారావు, సిపిఎం నాయకులు జి.రాజు, నిమ్మగడ్డ నరసింహ, మరియదాసు, రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు, అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి శిఖా ఆకాష్, ఎఐటియుసి, ఎఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : కొయ్యలగూడెం ప్రధాన సెంటర్‌లో సిపిఐ కొయ్యలగూడెం మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జమ్మి శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలతో నిరుపేద ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికైనా పేద, మధ్యతరగతి ప్రజలను నరేంద్ర మోడీ గుర్తు చేసుకుని వారికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి ఎస్‌కె.బాజీ, సీనియర్ నాయకులు నారాయణరావు, వి.నాని, ఎస్.గిరి, కోరుకొల్లు నాగరాజు, చంద్రశేఖర్, ఎం.రామకృష్ణ, నర్సయ్య, పండు, పత్తిపాటి గంగరాజు, వెంకటేష్, గోపి, రాంబాబు, చింతలపూడి దుర్గారావు, గోపాలం పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి 'గడపగడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి - భీమడోలు

గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు నేరుగా తెలుసుకోవడంతో పాటు వాటిని వెంటనే పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. మండలంలోని ఆగడాలలంక, చెట్టున్నపాడు గ్రామాల్లో శుక్రవారం ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబుతో కలిసి గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో కలెక్టర్ ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబు మాట్లాడుతూ గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. చెట్టున్నపాడు గ్రామానికి చెందిన సైదు వెంకమ్మ తనకు గృహం మంజూరు చేయాలని, జిహెచ్.సీతారత్నం, జి.వెంకటేశ్వరమ్మ తమకు పెన్షన్ మంజూరు చేయాలని, వికలాంగుడు జె.నాగరాజు తనకు మూడు చక్రాల వాహనం కావాలని, టి.శ్రీదేవి ఇంటి స్థలం మంజూరు చేయాలని, జి.నాగదేవి అమ్మఒడి మంజూరు చేయాలని కోరారు. వీటితోపాటు గ్రామంలో ప్రభుత్వ పశు వైద్యశాలకు మరమ్మతులు చేసి పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించాలని గ్రామస్తులు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబులను కోరగా వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ కె.కిశోర్, తహశీల్దార్, ఎంపిడిఒ పాల్గొన్నారు.

లంక గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

మండలంలోని కొల్లేరులంక గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ హామీ ఇచ్చారు. శుక్రవారం రాత్రి చెట్టున్న పాడు గ్రామంలో శాసనసభ్యులు పుప్పాల వాసు బాబు ఆధ్వర్యంలో చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మండల పర్యటనకు వస్తున్న కలెక్టర్‌ను భీమడోలు ఎంపిపి కె.రామయ్య, సర్పంచి భలే రాంబాబు ఇతర గ్రామస్తులు ఆగడాలలంక గ్రామం వద్ద కలిశారు. ఎంఎల్‌ఎ సూచన మేరకు వారు తమ గ్రామంలో తాగునీటి సమస్యను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. చెట్టున్నపాడులో సైతం ఇదే తరహా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులతో పాటు పలువురు జిల్లా స్థాయి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

'కాలిన' బతుకులు..!

తప్పెవరిది.. శిక్షెవరికి..?
కడియుద్ద ఘటనపై అనుమానాలెన్నో
నాలుగుకు చేరిన మృతుల సంఖ్య
150 మీటర్ల దూరానికి ఎగిరిపడిన శరీర భాగాలు
ఎక్కడ చూసినా బీతావాహమే
అనుమతులు తక్కువ.. తయారీ ఎక్కువ
అదే ప్రమాదానికి మూలకారణం?
అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆగ్రహం



ఘటనా స్థలం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం రూరల్

తప్పు ఒకరు చేస్తే.. శిక్ష మరొకరికి పడింది.. కూలీ..నాలీ చేసుకుని పిల్లాపాపలతో సంతోషంగా జీవనం సాగిస్తున్న కుటుంబాల్లో అంతులేని విషాదాన్ని నిపింది.. నాలుగు నిండు ప్రాణాలను బలిగొంది.. ఎవరి మృతదేహం ఎవరిదో కనీసం గుర్తుపట్టలేనంత బీతావాహాన్ని నెలకొల్పింది.. తునాతునకలైన మృతదేహాలను చూసిన మృతుల బంధువులను గుండెలవిసేలా విలపించేలా చేసింది..

తాడేపల్లిగూడెం గ్రామీణ మండలం కడియుద్ద గ్రామంలో గురువారం రాత్రి చోటుచేసుకున్న బాణసంచా పేలుడు ప్రమాదంపై ఎన్నో ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ ప్రమాదంలో గురువారం రాత్రే ముగ్గురు మృత్యువాత పడగా కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్న మరో వ్యక్తి రాజమహేంద్రవరంలోని ఆసుపత్రిలో శుక్రవారం మృతిచెందారు. తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన అన్నవరం అనే వ్యక్తి సుమారు ఐదేళ్ల క్రితం కడియుద్ద గ్రామంలో బాణసంచా తయారీ పరిశ్రమకు అనుమతులు తీసుకున్నాడు. దీనికిగానూ పరిశీలన చేసిన అధికారులు 15 కిలోల వరకూ పోటాషియం దిగుమతి చేసుకునేందుకు మాత్రమే అనుమతులిచ్చారు. మొదట్లో కొంతకాలం వరకూ అనుమతి మేరకు మాత్రమే పోటాషియం దిగుమతి చేసుకుని ఇక్కడ బాణసంచా తయారు చేసేవారు. కానీ ఉభయ తెలుగురాష్ట్రాలతో పాటుగా కర్ణాటక, తమిళనాడు, ఒడిషా వంటి రాష్ట్రాలకు కూడా ఇక్కడ నుంచి ఎగుమతులు ప్రారంభం కావడంతో తయారీదారుడు నిబంధనలను తుంగలో తొక్కడం మొదలుపెట్టాడు. గురువారం ప్రమాదం జరగడానికి ముందు ఇక్కడ 24 టన్నుల కెపాసిటీ గల లారీలో పోటాషియంతో పాటుగా పేలుడుకు సంబంధించిన ఇతర సామగ్రిని కూడా దిగుమతి చేసుకున్నాడని గ్రామస్తులు చెబుతున్నారు. అందులో సుమారు నాలుగువేల కిలోల వరకూ పోటాషియాన్ని దిగుమతి చేసుకుని ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అంతమొత్తంలో దిగుమతి చేసుకోవడం వల్లే ప్రమాదం తీవ్రత ఈ స్థాయిలో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన ప్రాంతానికి కూతవేటు దూరంలోనే రెండు గోదాముల్లో మందుగుండు ఉంది. ఆ గోదాములకు నిప్పంటుకుని ఉంటే ప్రమాద తీవ్రత మరింత అధికంగా ఉండేదని గ్రామస్తులు చెబుతున్నారు.

నాలుగుకు చేరిన మృతుల సంఖ్య

పేలుడు దుర్ఘటనలో కాకినాడ జిల్లా జగ్గంపేటకు చెందిన యాళ్ల ప్రసాద్, రొయ్యల స్వామి, నాగిరెడ్డి నాని గురువారం మతి చెందారు. ప్రమాదం జరిగిన వెంటనే అధిక సంఖ్యలో మృతులు ఉంటారని అంతా అనుమానించారు. వారి శరీర భాగాలు చెల్లా చెదురుగా పడి ఉండడంతో చూసిన వారికి గుండె తరుక్కుపోయింది. నల్లజర్ల మండలం అనంతపల్లికి చెందిన రాజు తీవ్ర గాయాలపాలై రాజమహేంద్రవరం



దగ్ధమైన ద్విచక్ర వాహనం

ఆసుపత్రిలో చికిత్సపొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మృతిచెందారు. దీంతో మృతుల సంఖ్య నాలుగుకు చేరుకుంది.

నిర్లక్ష్యమే బలిగొంది..?

అగ్ని మాపక వాహనం ఘటనా స్థలానికి చేరుకోవడానికి అవకాశం లేకపోయింది. పుంత రహదారి ఇరుకుగా ఉండడంతో వాహనం దూరంగానే ఉండిపోవాల్సి వచ్చింది. పోలీసులే అంతిమంగా రంగంలోకి దిగారు. పక్కనే ఉన్న చెరువులో ఇంజన్‌ను ఏర్పాటు చేసి మంటలను అదుపులోకి తెచ్చారు. అగ్నికీలలు, మరోవైపు పేలుడు శబ్దాలు వినిపిస్తుండడంతో గంట వరకు ప్రమాద స్థలానికి చేరుకోవడానికి ఎవరూ సాహసించలేకపోయారు. ఆ తర్వాతే కడియద్దతో పాటు, చుట్టు పక్కల గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకుని సహకారం అందించారు. రాత్రి 11 గంటల సమయానికి మంటలు అదుపులోకి వచ్చాయి. తయారీ కేంద్రానికి అనుమతి ఇవ్వొద్దంటూ ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పెడచెవిన పెట్టారంటూ కడియద్ద గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం అగ్నిమాపక వాహనం వెళ్లేందుకు రహదారి లేకపోవడాన్ని గ్రామస్తులు వేలెత్తి చూపారు.

కొన్నేళ్ల క్రితం ఉంగుటూరు మండలం వెల్లమిల్లిలో ఇదే తరహాలో పేలుడు చోటు చేసుకుంది. అయినా అధికారులు పాఠాలు నేర్వలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కడియుద్దలో పరిమితికి మించి మందుగుండు నిల్వలున్నా సరే అధికారులు పట్టించుకోలేదు. దాంతోపాటు, నిబంధనలకు విరుద్ధంగా పెంకు చిచ్చుబుడ్డిలను వినియోగించారు. తయారీ కేంద్రానికి ఎలాంటి విద్యుత్ కనెక్షన్ ఉండకూడదనే నిబంధన ఉన్నా అనధికారికంగా విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేయడం విస్మయానికి గురిచేసింది. అనధికారికంగా విద్యుత్ కనెక్షన్ తీసుకుని లైట్ల వెలుతురులో రాత్రి సమయంలో కూడా ఇక్కడ మందుగుండు తయారీ చేస్తున్నారు. దానికితోడు తాటాకులతో గుడిసెలు వేసి అందులో మందుగుండు తయారీ చేయడం కొసమెరుపు.

తెలికచర్ల నుంచి కూలీలు వచ్చి ఉంటే..!

ప్రతిరోజూ నల్లజర్ల మండలం తెలికచర్ల గ్రామం నుంచి ఇక్కడ పనిచేసేందుకు 15 మంది వరకూ కూలీలు వస్తుండేవారని స్థానికులు చెబుతున్నారు. కానీ గురువారం వారు పనిచేయడానికి రాలేదని చెప్పారు. లేకుంటే పెనుప్రమాదం వాటిల్లేదని వారు చెబుతున్నారు. దీపావళికి ముందు ఈ కేంద్రంలో ప్రతిరోజూ సుమారు 400 మంది వరకూ పనిచేసేవారని, ఆ సమయంలో ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే తీవ్రత ఊహకే అందడం లేదని స్థానికులు చెబుతున్నారు.

ఫైర్ సేఫ్టీ ఎక్కడా..!

ఈ పరిశ్రమ యజమాని అన్నవరం అత్యాశే ప్రమాదానికి మూలకారణంగా కనిపిస్తోంది. ఈ పరిశ్రమలో అగ్నిమాపక శాఖకు సంబంధించిన ఎలాంటి నిబంధనలనూ పాటించడం లేదు. ప్రమాదం వాటిల్లితే మంటలను అదుపు చేయడానికి నీటిపైపులను ఏర్పాటు చేయలేదు. మంటలను అదుపుచేసే సిలిండర్లు లేవు. కనీసం ఇసుకను కూడా అందుబాటులో ఉంచలేదు. ఇవన్నీ బహిరంగంగా కనిపిస్తున్నా అధికారులు ఎందుకు పట్టించుకోలేదనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. అధికారులకు ప్రతినెలా మామూళ్లు పంపించడం వల్లే వారు చూసీచూడనట్లు వ్యవహరించారని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ పంచాయతీ కార్యదర్శికి దీన్ని ఇక్కడ నుంచి తరలించాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఆయన పట్టించుకోలేదని, కేవలం అన్నవరం ఇచ్చే కాసులకు కక్కుర్తిపడే ఈ విధంగా వ్యవహరించారని ఆరోపిస్తున్నారు.

తాడేపల్లిగూడెం : కడియద్దలో మందుగుండు సామగ్రి తయారీ కేంద్రంలో గురువారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో చనిపోయిన వారికి రూ.25 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని సిపిఎం తాడేపల్లిగూడెం పట్టణ కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని శుక్రవారం పార్టీ నాయకులు పరిశీలించారు. ప్రశాంతంగా ఉన్న కడియద్దలో ఇలాంటి సంఘటన జరగటం విచారకరమన్నారు. ఇలాంటి ప్రమాదాలు జరిగిన సందర్భాల్లోనే అధికారులు మేల్కోవడం జరుగుతుందని విమర్శించారు. బాణసంచా తయారీ కేంద్రాల్లో జిల్లా అధికారుల నిరంతర పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయన్నారు. గతంలో ఉంగుటూరు మండలంలోని జరిగిన సంఘటనలో చనిపోయిన అనుభవాలు ఉన్నప్పటికీ అధికారులు అప్రమత్తంగా లేకపోవడం విచారకరమన్నారు. తాడేపల్లిగూడెం పరిసర ప్రాంతాల్లో ఉన్న మందుగుండు తయారీ కేంద్రాలను, గొడౌన్లలో అధికారులు తనిఖీచేసి లైసెన్సు, మందుగుండు సామగ్రి నిల్వలు సామార్థ్యానికి ఉన్న అనుమతులను పరిశీలించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు చింతకాయల బాబూరావు, జిల్లా కమిటీ సభ్యులు కర్రి నాగేశ్వరరావు, పట్టణ కమిటీ సభ్యులు కరెడ్ల రామకష్ణ ఉన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

ఘనంగా ఆజాద్ జయంతి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

భారతరత్న డాక్టర్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని స్థానిక జెడ్‌పిహెచ్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆజాద్ చిత్రపటానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు గద జగ్గారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ఎన్‌సిసి ఆఫీసర్, వ్యాయామ ఉపాధ్యాయులు అల్లు భక్తు మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ బహు భాషా కోవిదుడు, సాహిత్య వేత్త అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఫస్ట్ అసిస్టెంట్ చిలుకూరి సుధాకర్‌రెడ్డి, స్టాఫ్ సెక్రటరీ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - గణపవరం

గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా వైసిపి ప్రభుత్వం పని చేస్తుందని ఎంఎల్ఎ పుప్పాల శ్రీనివాసరావు(వాసుబాబు) అన్నారు. వల్లూరు, వీరేశ్వరపురం గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. వల్లూరులో రూ.40 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని, రూ.22 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. వీరేశ్వరపురంలో నాడు నేడు నిధులు రూ.29 లక్షలతో పాఠశాలకు అదనపు గదులు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఎస్‌సి పేటలో రూ.24 లక్షలతో నిర్మించిన వాటర్ ట్యాంకును ప్రారంభించారు. అనంతరం వాసుబాబు మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కలగజేయడానికి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వల్లూరు గ్రామ సర్పంచి ముచ్చర్ల వేణుగోపాలకృష్ణ, వీరేశ్వరపురం సర్పంచి ఆడబాల రవిశంకర్, ఎంపిపి దండు రామారాయా(అర్జరదంగం), జెడ్‌పిటిసి దేవవరపు సోమలక్ష్మి, ఎంపిడిఒ జి.జ్యోతిర్మయి, సూర్య బలిజ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ శెట్టి అనంతలక్ష్మి, తహశీల్దార్ ఎం.సన్యాసిరావు, ఎఒడ్యూటీ ఎఇ కె.హరినాథ్‌రావు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి - మండవల్లి

ధర్మకర్తలు ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు చెప్పారు. స్థానిక శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించిన నూతన పాలకవర్గ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మండవల్లిలో ఉన్న శివాలయం అతి పురాతనమైన దేవాలయం అని అన్నారు. శివాలయాన్ని పునఃనిర్మించడానికి ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. శివాలయ ఆధ్వర్యంలో ఉన్న నిధులను సక్రమంగా వినియోగించి నూతన శివాలయ నిర్మాణ పనులు త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. అనంతరం ఆలయ కమిటీ ధర్మకర్తలతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామ్ దుర్గాప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షులు బొమ్మనబోయిన గోకర్ల యాదవ్, సర్పంచుల సంఘం అధ్యక్షులు బేతపూడి ఏసేవ రాజు, కార్యనిర్వహణ కార్యదర్శి సింగనపల్లి శ్రీనివాస్, సర్పంచి మెండ యూస్నీ, వైస్ సర్పంచి జొన్నలగడ్డ నాగలక్ష్మి పాల్గొన్నారు.

కానుకొల్లులో డ్రెయిన్లు ఏర్పాటు

ప్రజాశక్తి - మండవల్లి

మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా పనిచేస్తూ గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని కానుకొల్లు సర్పంచి నాగ దాసి థామస్ అన్నారు. గ్రామంలోని శివారు ఆయన దర్గపుంత కట్టా డ్రెయిన్లు తవ్వించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని లోతట్టు ప్రాంతాల్లో డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల మురుగునీరు రోడ్లపై ఉంటుందని గ్రామస్తుల నుంచి వినతులు వచ్చాయన్నారు. గ్రామంలో పర్యటించి పూర్తిస్థాయిలో పరిశీలించామన్నారు. రోడ్లపై మురుగునీరు నిల్వ లేకుండా పంచాయతీ ఆధ్వర్యంలో కచ్చా డ్రెయిన్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు మీనాకుమారి, కార్యదర్శి పి.రత్నకుమారి పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం

ప్రజాశక్తి - భీమడోలు

విద్యార్థులు, యువత గ్రంథాలయాలకు నిత్య సందర్శలుగా మారటం వల్ల మరింత విజ్ఞానవంతులు కావచ్చని, వారి ఉజ్వల భవిష్యత్తుకు సహకారం లభిస్తుందని ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు అన్నారు. భీమడోలు శాఖ గ్రంథాలయంలో గ్రంథ పాలకులు కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించే గ్రంథాలయ వారోత్సవాల కరపత్రాలను ఎంఎల్ఎ చెట్టున్నపాడులో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రంథ పాలకులు మాట్లాడుతూ వారోత్సవాల్లో భాగంగా 14వ తేదీన భీమడోలు సర్పంచుల ఛాంబర్ అధ్యక్షురాలు పాము సునీత మాన్ సింగ్ వారోత్సవాలను ప్రారంభిస్తారన్నారు. ఎంపిపి కె.రామయ్య ముఖ్యమంత్రి సందేశం గల కరపత్రాలను ఆవిష్కరిస్తారన్నారు. జెడ్‌పిటిసి తుమ్మగుంట భవానిరంగ పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తారన్నారు. ఎఎంసి చైర్ పర్సన్ ఇంజేటి నీలిమ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. వైస్ ఎంపిపి ఎం.ఫణిపద్మజ జాతీయ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి సత్కరిస్తారన్నారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించనున్నట్లు తెలిపారు.

'టిడిపి గెలుపే ధ్యేయంగా పనిచేయాలి'

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

2024 ఎన్నికల్లో టిడిపి గెలుపే లక్ష్యంగా పని చేయాలని జిల్లా ఎస్‌సి సెల్ అధ్యక్షులు యాళ్ల సంజీవరావు తెలిపారు. మండల ఎస్‌సి సెల్ అధ్యక్షులు గొల్లమందల శ్రీనివాసరావు, మండల ప్రధాన కార్యదర్శి కుక్కల మాధవరావు, పట్టణ ఎస్‌సి సెల్ అధ్యక్షులు ఎడ్లపల్లి ఏడుకొండలు అధ్యక్షతన టిడిపి కార్యాలయంలో దళితుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంజీవరావు మాట్లాడుతూ రాష్ట్రంలో దళితుల ఓట్ బ్యాంకింగ్‌తో గద్దెనెక్కిన జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం దళితుల సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేస్తుందన్నారు. రాష్ట్రంలో దళిత మహిళలపై హత్యలు, అత్యాచారాలు ఎక్కువయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిపి చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు బోడ అనీష్‌కుమార్, నియోజకవర్గ నాయకులు పల్లి శ్రీను, తెలుగుయువత ఏలూరు పార్లమెంట్ కార్యదర్శి బొకినాల వాసు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించే సేవలను రైతులందరూ వినియోగించుకోవాలని జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బాల సూర్యనారాయణరాజు మాట్లాడుతూ నవభారత్ కంపెనీ నచ్చిన రైతులకే పామాయిల్ మొక్కలు సరఫరా చేసి మిగిలిన వారికి అన్యాయం చేస్తుందని విమర్శించారు. ఉద్యానవనం శాఖ అధికారులు రైతు భరోసా కేంద్రాల ద్వారా పామాయిల్ మొక్కలకు దరఖాస్తు చేయించి రైతులందరికీ అందేటట్లు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి డి.లక్ష్మి, వ్యవసాయశాఖ అధికారి డి.ముత్యాలరావు, ఉద్యానవన శాఖ అధికారి లఖ్‌పతి, పశువైద్యాధికారి కె.కోటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటివ్ అధికారి పి.శ్రీనివాస్, కె.జగ్గవరం సొసైటీ చైర్ పర్సన్ వాసిరెడ్డి మధు, రైతులు రామ్మోహన్‌రావు, డి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

సజ్జల, అప్పిరెడ్డిని కలిసిన శారద

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని శ్రీహరిపురానికి చెందిన వైసిపి రాష్ట్ర నాయకురాలు టి.శారద శుక్రవారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని, ఎంఎల్‌సి లేళ్ల అప్పిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శారద కైకలూరు నియోజవర్గంలో ప్రస్తుత పరిస్థితుల గురించి సజ్జల, అప్పిరెడ్డిలకు వివరించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా సజ్జల, అప్పిరెడ్డిలు వచ్చే ఎన్నికలకు సిద్ధం కావాలని ఆమెకు సూచించినట్లు తెలిపారు.

140 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

రేషన్ బియ్యాన్ని అక్రమ రవాణా చేస్తున్న నలుగురిపై కేసు నమోదు చేసి 140 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ సాగర్‌బాబు తెలిపారు. సిఎస్ డిటి సుధాకర్‌కు వచ్చిన సమాచారం మేరకు మండలంలోని రామచర్లగూడెం పెట్రోల్ బంకు వద్ద లారీలో రవాణా చేస్తున్న రేషన్ బియ్యాన్ని రెవెన్యూ సిబ్బంది గుర్తించారని తెలిపారు. సిఎస్ డిటి సుధాకర్ ఫిర్యాదు మేరకు ఇరగవరం మండలం కె.కుముదవల్లి గ్రామానికి చెందిన పాయం నాగ వరప్రసాద్, మరో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. 140 క్వింటాళ్ళ రేషన్ బియ్యం విలువ రూ.2.50 లక్షలు ఉంటుందని తెలిపారు. లారీని, రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అధికారులొస్తున్నారని..!

మండవల్లిలో హడావుడిగా పారిశుధ్య పనులు
అప్పటివరకు స్పందించని వైనం
పంచాయతీ సిబ్బంది తీరుపై గ్రామస్తుల విమర్శలు

ప్రజాశక్తి - మండవల్లి

మండవల్లి అభివృద్ధి చెందాలన్నా.. స్వచ్ఛ గ్రామం కావాలన్నా జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు వస్తేనే అది సాధ్యమయ్యే పరిస్థితులు నెలకొన్నాయని మరోసారి రుజువైందని గ్రామస్తులు స్పష్టం చేస్తున్నారు. దీనికి నిదర్శనమే జిల్లా పంచాయతీ అధికారులు పారిశుధ్యంపై మండలంలో పర్యటిస్తారని వచ్చిన సమాచారంతో సంపద కేంద్రంలో పేరుకుపోయిన పిచ్చి మొక్కలను యుద్ధ ప్రాతిపదికన తొలగించారు. అధికారులు రావడంలేదని తెలియడంతో ఒక్కసారిగా పంచాయతీ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. 2018-2019 ఆర్థిక సంవత్సరంలో ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో పంచాయతీకి ఆదాయం సమకూర్చుకునే విధంగా సంపద కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అప్పటినుంచి ఇప్పటివరకు సంపద కేంద్రంపై పైసా ఆదాయం రాకపోగా సంపద కేంద్రంలో పిచ్చి మొక్కలు బాగా పెరిగిపోయాయి. గ్రామంలో సేకరించిన తడి పొడి చెత్తను సంపద తయారీ కేంద్రానికి తరలించకుండా జాతీయ రహదారిపై కుప్పలు కుప్పలుగా వేసేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతంలో దుర్వాసన వెదజల్లడంతో పాటు ఆ ప్రాంతంలో సంచరిస్తున్న పందులు, ఆవులు వల్ల ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాశక్తి దినపత్రికలో సమస్యల వలయంలో మండవల్లి అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మండవల్లిలో పర్యటించనున్నట్లు సమాచారం. దీంతో పంచాయతీ అధికారులు సంపద కేంద్రంలో పెరిగిన దట్టమైన పిచ్చి మొక్కలను తొలగించారు. అంతేకాకుండా గ్రామంలో ప్రధాన రహదారి వెంబడి ఉన్న చెత్తను కూడా హుటాహుటిన తొలగించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు గ్రామంలో పర్యటిస్తారని సమాచారంతో పంచాయితీ అధికారులు రెండు ట్రాక్టర్లను ఏర్పాటు చేసి జాతీయ రహదారి వెంబడి పేరుకుపోయిన చెత్తను తొలగించి దుర్వాసన వెదజల్లకుండా ఆ ప్రాంతంలో బ్లీచింగ్ చల్లించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వస్తేనే గ్రామంలో పేరుకుపోయిన చెత్తను తొలగించేలా చర్యలు తీసుకోవడం దారుణమని గ్రామస్తులు అంటున్నారు. ఇళ్లల్లోని మురుగునీరు గ్రామంలోని జాతీయ రహదారులపై చేరుకుని దుర్వాసన వెదజల్లుతుందని, ఆ మురుగు నీటిలోనే రాకపోకలు సాగించాల్సి వస్తుందని, అయినప్పటికీ పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండల కేంద్రమైన మండవల్లిలో పర్యటించి పరిశీలించి పంచాయతీ అధికారులపై చర్యలు తీసుకుని మండవల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. దీనిపై కార్యదర్శి శ్రీనివాసరావును వివరణ కోరగా సంపద కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకువచ్చేలా చెత్తను తొలగించడానికి శ్రీకారం చుట్టామని ఆయన తెలిపారు.


సంపద కేంద్రంలో తొలగిస్తున్న పిచ్చి మొక్కలు

విద్యార్థులకు ఉచిత బస్‌పాసులు

ప్రజాశక్తి - ముసునూరు

దూర ప్రాంత విద్యార్థులు బస్‌పాసు సౌకర్యం వినియోగించుకుని విద్యలో రాణించాలని జెడ్‌పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన అన్నారు. మండలంలోని చక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ఉచిత బస్‌పాసులు అందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు మూల్పూరి నాగవల్లేశ్వరరావు, లోపూడి సర్పంచి పేరం కృష్ణ, కోర్లగుంట ఎంపిటిసి సభ్యులు సుందరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులకు బస్‌పాసులు అందిస్తున్న జెడ్‌పిటిసి, ఎంపిపి

19, 20 తేదీల్లో సిఐటియు జిల్లా మహాసభ

ప్రజాశక్తి - దెందులూరు

ఈ నెల 19, 20 తేదీల్లో ఏలూరులో నిర్వహించనున్న సిఐటియు ఏలూరు జిల్లా 12వ మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.లింగరాజు కోరారు. దెందులూరులో సిఐటియు మండల కమిటీ సమావేశం ఎం.రమేష్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.లింగరాజు మాట్లాడుతూ ఇసుకను చౌకగా ఇచ్చి ఇంటి కార్మికుల ఉపాధిని కాపాడాలని కోరారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కామేశ్వరి, ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం, మేరీ పాల్గొన్నారు.

అన్నదాతలకు అండగా రైతు భరోసా కేంద్రాలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

అన్నదాతలకు అండగా రైతు భరోసా కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఎంపిపి కొర్స పోసమ్మ అన్నారు. జీలుగుమిల్లి వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతు భరోసా కేంద్రాలకు శుక్రవారం కంప్యూటర్ పరికరాల పంపిణీ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు వసంతరావుతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి పథకాలను ప్రవేశ పెడుతుందన్నారు. పథకాలు రైతులకు చేరాలంటే అగ్రికల్చర్ అసిస్టెంట్లు నిబద్ధతతో పని చేయాలని కోరారు. త్వరలో మండలంలో మూడు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు సిబ్బందికి తేమ శాతం చూసే పరికరాలను అందించారు. అనంతరం ఎంపిపి, జెడ్‌పిటిసి సభ్యులు కలిసి ఆర్‌బికెలకు కంప్యూటర్ పరికరాలను అందించారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అధికారి గంగాధర్, రష్మి, లావణ్య దుర్గ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

అచియ్యపాలెం రైతు భరోసా కేంద్రం వద్ద ఎంఎల్ఎ తెల్లం బాలరాజు శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుట్టాయ గూడెం, రెడ్డిగణపవరం, జైనవారిగూడెం, విప్పల పాడు, అచియ్యపాలెం, ఎన్ఆర్.పాలెం రైతు భరోసా కేంద్రాలను ధాన్యం కొనుగోలు కేంద్రాలుగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు రామతులసి, ఎంపిపి కారం శాంతి పాల్గొన్నారు.

విద్యుత్ ఫ్యూజ్‌బాక్స్ సమస్య పరిష్కారం

ప్రజాశక్తి వార్తకు స్పందన


స్తంభానికి ఎత్తులో ఏర్పాటు చేసిన ఫ్యూజ్‌బాక్స్

ప్రజాశక్తి - ముదినేపల్లి

ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ఫ్యూజ్‌బాక్స్‌ను విద్యుత్ సిబ్బంది స్తంభానికి ఎత్తులో ఏర్పాటు చేశారు. ఈ నెల 11వ తేదీన శుక్రవారం ప్రజాశక్తి దినపత్రికలో ప్రమాదకరంగా విద్యుత్ ఫ్యూజ్‌బాక్స్ శీర్షికన వెలువడిన వార్తకు విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. మండల విద్యుత్ శాఖ ఎఇ పి.రవికుమార్ తన సిబ్బందిని పంపి భూమికి అడుగు ఎత్తులో ఉన్న ఫ్యూజ్‌బాక్స్‌ను సరి చేయించారు. విద్యుత్ స్తంభానికి ఇరువైపులా ఉన్న ముళ్లచెట్లు కొట్టించి శుభ్రం చేయించారు. విద్యుత్ ఫ్యూజ్‌బాక్స్‌ను స్తంభానికి ఐదు అడుగుల ఎత్తులో ఏర్పాటు చేశారు. దీంతో సమస్య పరిష్కారమైంది.

ముగిసిన క్విజ్ పోటీలు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

పాఠశాల స్థాయి కౌశల్ క్విజ్ పోటీలు గురు, శుక్రవారాల్లో జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికి తీసేందుకు ఇలాంటి పోటీ పరీక్షలు దోహదపడతాయని కౌన్సిల్ జిల్లా సమన్వయకర్త స్వర్ణ వెంకటేశ్వరావు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 2004 రిజిస్టర్ పాఠశాలల్లో విద్యార్థులు ఈ క్విజ్ పోటీల్లో పాల్గొన్నారు. ప్రతి పాఠశాల నుంచి 8, 9, 10 తరగతి చదువుతున్న విద్యార్థులు పరీక్షలో పాల్గొన్నారు. విజ్ఞాన భారతి, ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. నవంబర్ 26వ తేదీన జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో జిల్లాకు చెందిన మూడు వేలకు పైగా విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ బహుమతి రూ.7,500, రెండో బహుమతి రూ.ఆరు వేలు, మూడో బహుమతిగా రూ.4,500 ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందించనున్నట్లు తెలిపారు. పోస్టర్ కాంపిటేషన్లో పాల్గొనే విద్యార్థులు నవంబర్ 17వ తేదీలోగా వారి ఎంట్రీలను పంపాలని ఆయన కోరారు.

ఆయనొస్తే చేయి తడపాల్సిందే..!

'మెట్ట'లో వ్యవసాయాధికారి అవినీతి దందా
వణికిపోతున్న రైతులు, పురుగు మందుల దుకాణాదారులు

ప్రజాశక్తి - ఏలూరు

చింతలపూడి ప్రాంతంలో ఓ వ్యవసాయ అధికారి అవినీతి దందా రోజురోజుకు పెరిగిపోతోంది. చింతలపూడి మండలంలో ఒక పురుగు మందుల దుకాణా యాజమని వద్ద షాపు అనుమతుల రెన్యువల్ కోసం ఆ వ్యవసాయ అధికారి రూ.40 వేలు డిమాండ్ చేశారని బాధితుడు అగ్రికల్చరల్ కమిషనర్‌కు ఫిర్యాదు కూడా చేసినట్లు తెలిసింది. లింగపాలెం మండలంలోని ఓ చిన్నపాటి పురుగు మందుల దుకాణాదారుడిని రూ.30 వేలు డిమాండ్ చేయగా, అతను అంత ఇచ్చుకోలేక రూ.15 వేలు ఇచ్చినట్లు సమాచారం. అలాగే చింతలపూడి మండలంలో ఓ పురుగు మందుల షాపు యాజమని వద్దకు వెళ్లిన ఆ వ్యవసాయ అధికారి దుకాణదారుని మెడలో ఉన్న బంగారు గొలుసును చూస్తానని చెప్పి తీసుకెళ్లిపోయి తనకు రూ.50 వేలు ఇస్తేనే ఆ గొలుసును తిరిగి ఇస్తానని ఒత్తిడి చేసినట్లు తెలిసింది. దీంతో ఆ దుకాణాదారుడు ఎంఎల్ఎను ఆశ్రయించాడు. ఎంఎల్ఎ ఆ అధికారికి ఫోన్ చేసి హెచ్చరించడంతో గొలుసు తిరిగి ఇచ్చినట్లు తెలిసింది. అంతకాక ఎవరైనా ఆ వ్యవసాయ అధికారిని కలవాలంటే కొన్ని నిబంధనలు పాటించాలని హుకుం జారీ చేసినట్లు తెలిసింది. ముందుగా సెల్‌ఫోన్లు బయటే పెట్టి ఇంట్లోకి వెళ్లాలని నిబంధన పెట్టినట్లు తెలిసింది. ముఖ్యంగా రాత్రి పది గంటల తర్వాత ఇలాంటి కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. నాలుగు నెలల క్రితమే ఆయన బాధ్యతలు స్వీకరించారు. అతని అవినీతి దందాకు రైతులు, ఎరువులు, పురుగు మందుల దుకాణాదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తనపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

750 మందికి భోజనాలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఎన్‌టిఆర్ అన్నక్యాంటీన్ స్ఫూర్తితో ముదినేపల్లికి చెందిన టిడిపి యువనేత కొడాలి వినోద్ కబడ్డీ పోటీల్లో పాల్గొనే జట్ల ఆటగాళ్లకు భోజనాలు పంపిణీ చేస్తున్నారు. మండలంలోని బొమ్మినంపాడులో జరుగుతున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటున్న జట్ల ఆటగాళ్లకు, పోటీలను తిలకించేందుకు వచ్చే ప్రజలకు శుక్రవారం వినోద్ భోజనాలు అందించారు. మొత్తం 750 మందికి భోజనాలు అందించినట్లు వినోద్ ఫాలోవర్స్ తెలిపారు. శని, ఆదివారాలు కూడా పోటీలు జరగనున్న నేపథ్యంలో అప్పటివరకు ఆటగాళ్లకు, సందర్శకులకు ఉచితంగా భోజనాలు అందించనున్నట్లు తెలిపారు.

త్వరగా ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టాలి

ప్రజాశక్తి - కైకలూరు రూరల్

ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులు ఈ నెలాఖరులోగా ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించాలని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన ఎంపిపి అడవి కృష్ణ ఆధ్వర్యంలో పట్టణంలోని జగనన్న గ్రీన్ విలేజ్‌లో ఇంటి పట్టాలు పొందిన లబ్ధిదారులతో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో 12 వేల మంది పైగా లబ్ధిదారులకు స్థలాలు ఇచ్చి, ఇంటి నిర్మాణాలకు అనుమతులు ఇచ్చామన్నారు. కైకలూరులో 2,042 మందికి వంద ఎకరాల లే అవుట్ చేసి ఎనిమిది అడుగుల ఎత్తు పైగా మట్టి పూడిక చేసి ఇప్పటికే విద్యుత్ లైన్, మంచినీటి పైపులు వేశామన్నారు. సచివాలయం, అంగన్‌వాడీ, ప్రభుత్వ భవనాలు నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి నవరత్నకుమారి, తహశీల్దార్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

ముదినేపల్లి : జగనన్న లేఅవుట్‌లోని ఇళ్ల లబ్ధిదారులు శరవేగంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని తహశీల్దార్ కె.శ్రీనివాస్ అన్నారు. ముదినేపల్లి గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు ఇళ్ల నిర్మాణాలు మొదలుపెట్టని లబ్ధిదారులు త్వరితగతిన మొదలు పెట్టాలన్నారు. గ్రామ సర్పంచి కైకమ్మ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాల్లో లబ్ధిదారులకు ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ గ్రామ సభలో పంచాయతీ కార్యదర్శి టివి.సారథి, వైసిపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు నిమ్మగడ్డ బిక్షాలు, ఎంపిటిసి సభ్యులు ఎం.నాగయ్య, కోటయ్య పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం డివిజన్ పరిధిలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని డివిజనల్ అభివృద్ధి అధికారి ఎం.రాజు సూచించారు. డివిజన్‌లోని పది మండలాల వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్లతో హౌసింగ్ పథకంపై శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.రాజు మాట్లాడుతూ ఇల్లు మంజూరైన లబ్ధిదారులకు వైఎస్ఆర్ క్రాంతి పథం ద్వారా రూ.35 వేలు రుణం ఇప్పించి ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఇళ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డివిజన్‌లోని పది మండలాల ఎపిఎంలు పాల్గొన్నారు.

మహా అన్నసమారాధన

ప్రజాశక్తి - ముదినేపల్లి

కార్తీక మాసం, దసర ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని ముదినేపల్లిలోని బంటుమిల్లి రోడ్డులో ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద శుక్రవారం మహా అన్నసమారాధన నిర్వహించారు. ఈ అన్నసమారాధనను ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు వడ్డన చేసి ప్రారంభించారు. అన్న సమారాధనలో పది వేల మంది భక్తులు పాల్గొన్నట్లు ఆలయ చైర్మన్ పామర్తి వీరవెంకటసత్య నారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు ఈడే వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపిపిలు పునీత, రాధా, గంటా సంధ్య, పార్టీ మండల అధ్యక్షులు మోట్రు ఏసుబాబు, మాజీ ఎంపిపి వీరమల్లు నరసింహ రావు, బొర్రా చలమయ్య, శింగరాయపాలెం సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆలయ చైర్మన్ శొంఠి నాగ రాజు, వైస్ చైర్మన్ సత్యనారాయణ పాల్గొన్నారు.

రామన్నపాలెంలో 'గడపగడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని నూతి రామన్నపాలెం సచివాలయం పరిధిలో శుక్రవారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్ఎ తెల్లం బాలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వివరాలను ప్రజలకు వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కనకదాస జయంతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

భక్త కనకదాస జయంతి ఉత్సవాలను స్థానిక వెనుకబడిన తరగతుల సంక్షేమ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వెనుకబడిన తరగతుల జిల్లా సంక్షేమ శాఖాధికారి ఆర్‌వి.నాగరాణి భక్త కనకదాస చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ భక్త కనకదాస గొప్ప కర్ణాటక సంగీతకారుడే కాక, ప్రముఖ తత్వవేత్త, గొప్ప సంఘ సంస్కర్త అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నవరత్నాలతో ప్రజలకు ఒరిగిందేమీ లేదు : టిడిపి

ప్రజాశక్తి - నూజివీడు

నవరత్నాల్లో ప్రజలకు ప్రయోజనం కన్నా నష్టమే ఎక్కువ జరిగిందని టిడిపి నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు విమర్శించారు. పట్టణంలోని ఎంఆర్ అప్పారావు కాలనీలో మన ఇంటికి మన ముద్దరబోయిన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరత్నాల పేరిట నేరుగా ప్రజలకు లబ్ధి చేకూరుస్తానని చెబుతున్న ప్రభుత్వ పెద్దలు వాటి ద్వారా జరిగిన నష్టాలను సైతం వివరిస్తే బాగుంటుందన్నారు. ఎన్నికల సమయంలో రూపాయి ఖర్చు లేకుండా ఇల్లు నిర్మించి ఇస్తానన్న జగన్ తర్వాత మాట తప్పి కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.1.80 లక్షలతోనే సరిపెట్టిన విషయం ప్రజలకు చెప్పాలన్నారు. గడపగడపకు తిరుగుతున్న ప్రభుత్వ పెద్దలు ప్రభుత్వం ద్వారా ఇస్తున్న లబ్ధితోపాటు నిలిపివేసిన పథకాలు వారికి రావాల్సిన, ఆపేసిన విధానాన్ని కూడా వివరిస్తే బాగుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి పల్లి నాగరాజు, టిడిపి రాష్ట్ర బిసి సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ తలపంటి రాజశేఖర్, టిడిపి పట్టణ క్లస్టర్ ఇన్‌ఛార్జి ఎం.శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ కందుపల్లి చెన్నారావు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ విచారణ

ప్రజాశక్తి - చింతలపూడి

స్పందనలో వచ్చిన ఫిర్యాదుపై మండలంలోని ప్రగడవరంలో నూజివీడు సబ్ డివిజన్ సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ శుక్రవారం విచారణ చేపట్టారు. ప్రగడవరంలో బాధితులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ షకిలా, డిటి సురేంద్ర, ఆర్ఐ మణి పాల్గొన్నారు.

సిటిఆర్ఐ డైరెక్టర్‌గా శేషు

జీలుగుమిల్లి : కేంద్రీయ పొగాకు పరిశోధనా సంస్థ - రాజమండ్రి సిటిఆర్ఐ డైరెక్టర్‌గా మాగంటి శేషుమాధవ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన జీలుగుమిల్లి సిటిఆర్ఐ శాస్త్రవేత్తలతో, సిబ్బందితో జూమ్ మీటింగ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో పరిశోధనలకు నిధులు కొరత లేదని, శాస్త్రవేత్తలు తమ పరిశోధనల ద్వారా వ్యవసాయ రంగంలో అద్భుతాలు సృష్టించవచ్చని తెలిపారు. సిటిఆర్ఐను అభివృద్ధి పథంలో నడిపేందుకు అందరూ కలిసి కట్టుగా పని చేసి విజయం సాధించాలని సిబ్బందికి సూచించారు.